ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
శనివారం | 24 అక్టోబరు , 2026 | పేజీలు : 5

## ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధికి రూ.20 కోట్లు మంజూరు

**మేయర్ చైతన్య శ్రీనివాస్ రెడ్డి హర్షం వ్యక్తం**

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పానగల్‌లోని పచ్చల, ఛాయా సోమేశ్వర దేవాలయాలు చరిత్రకు సజీవ సాక్ష్యాలని నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పట్టణ సమీపంలోని పానగల్‌లోని చారిత్రాత్మక ఛాయా సోమేశ్వర స్వామి ఆలయం, పరిసర ప్రాంతాల అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.20 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసిన తెలంగాణ ప్రభుత్వానికి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఆలయ పరిసరాల సుందరీకరణ, పర్యాటక మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఈ నిధులు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన పానగల్ ప్రాంతాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.చారిత్రక ఆలయాల పరిరక్షణతో పాటు పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయం, పరిసర ప్రాంతాలు,సమీపంలోని జల వనరులను సమగ్రంగా అభివృద్ధి చేసి సుందరీకరించాలని ప్రతిపాదించారని, ఈ విషయాన్ని పరిశీలించిన ప్రభుత్వం తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌కు రూ.20 కోట్లు మంజూరు చేస్తూ పరిపాలనా పరమైన అనుమతి ఇచ్చిందని తెలిపారు.

# కోదాడ ప్రధాన రహదారిపై ట్రాఫిక్ నరకం



### ఆపరేషన్ రోపు సామాన్యులకేనా
### కార్పొరేట్ దుకాణాలకు ఒక న్యాయం... సామాన్యులకు మరో న్యాయమా...?
### అధికారుల మౌనంపై ప్రజల ఆగ్రహం

**ప్రజాపక్షం/కోదాడ:** పట్టణంలోని ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సమస్య రోజు రోజుకు తీవ్రమవుతోంది. పట్టణంలోని వాణిజ్య, వ్యాపార కార్యకలాపాల్లో సుమారు 80శాతం ఈ రహదారిపైనే సాగుతుండటంతో సూర్యాపేట రోడ్డు నుంచి ఖమ్మం ఎక్స్‌రోడ్డు వరకు నిత్యం వాహనాల రద్దీ కొనసాగుతోంది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, ఇతర వాహనాలతో రహదారి కిక్కిరిసిపోతుంది. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. రోడ్డుపై నడిచే పాదచారులకు సైతం దారి దొరకని పరిస్థితి నెలకొంటున్నా సంబంధిత అధికారులు శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



**ఆసుపత్రి ఎదుటే అస్తవ్యస్తం....** ప్రభుత్వాసుపత్రి ఎదురుగా ఇటీవల కార్పొరేట్ వస్త్ర దుకాణాలు పోటాపోటీగా ప్రారంభమయ్యాయి. ఆకర్షణీయమైన ఆఫర్ల ప్రచారాలతో ఈ దుకాణాలు వద్దకు పెద్ద సంఖ్యలో వినియోగదారులు వస్తున్నారు. దీంతో అక్కడ వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దుకాణాలకు వచ్చే వారు తమ వాహనాలను ఎక్కడ పడితే అక్కడ నిలిపివేయడం, వినియోగదారులను తీసుకొచ్చే ఆటోలు రహదారిపైనే ఆగడం వల్ల ట్రాఫిక్ మరింత అస్తవ్యస్తమవుతోందని స్థానికులు చెబుతున్నారు. అత్యవసర (మిగతా5లో)



## వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించే వరకూ పోరాటం

### 11వ రోజుకు ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరవధిక దీక్ష
### 17 వేల మంది ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక దీక్ష శుక్రవారం 11వ రోజుకు చేరుకుంది. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, ఏళ్ల తరబడి కాంట్రాక్టు,ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులకు న్యాయం చేయాలని దీక్షలో పాల్గొన్న ఉద్యోగులు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌హెచ్‌ఎం పరిధిలో పనిచేస్తున్న సుమారు 17 వేల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కోరారు. రెగ్యులరైజేషన్ ప్రక్రియ పూర్తయ్యే వరకు 100 శాతం గ్రాస్ శాలరీ చెల్లించడంతోపాటు ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలని స్పష్టం చేశారు.అదేవిధంగా 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని, ఐదు శాతం వార్షిక ఇంక్రిమెంట్లు, ఎనిమిది శాతం లాయల్టీ బోనస్, పీఆర్సీ ప్రయోజనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్న తమకు ఉద్యోగ భద్రత, న్యాయమైన వేతనాలు కల్పించడంలో ప్రభుత్వం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.తమ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని,డిమాండ్లు నెరవేరే వరకు నిరవధిక దీక్షను కొనసాగిస్తామని ఉద్యోగులు తేల్చిచెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ దీక్షలో మైక్రోబయాలజిస్ట్ ఆలకుంట్ల ఉపేందర్,డాక్టర్ ప్రియాంక,డాక్టర్ గాలి రాంబాబు,డాక్టర్ రమేష్,ఆడియాలజిస్టులు అనిల్,సంతోష్, డాక్టర్ వెంకటేశం,ల్యాబ్ టెక్నీషియన్ తరాల సురేష్,ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలోమైనర్ బాలిక మృతి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ (ఆత్మకూర్(ఎస్))** : 17 ఏళ్ళ బాలిక అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం ఏపూర్‌తండలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బాలిక హైదరాబాద్‌లో ఇంటర్ ద్వితీయ సంవ త్సరం చదువుతూ దసరా సెలవులు ఇంటికి వచ్చింది. శుక్రవారం తెల్లవారుజామున గ్రామ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ ఘాతం తగిలి స్పృహ కోల్పోయినట్లుగా స్థానికులు గుర్తించగా, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మైనర్ బాలికను వాంకుడోతు నరేష్ అనే వ్యక్తి వేధించగా అతని వేధింపులు భరించలేక మనస్తాపం చెంది ట్రాన్స్‌ఫార్మర్ పట్టుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లుగా బాలిక తండ్రి, అన్న ఆరోపిస్తున్నారు. వారి ఫిర్యాదు మేరకు నరేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## నీటి వృథా లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలి

### రానున్న పది నెలలు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి
### నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్



# నేడు ఎఐటియుసి జిల్లా కౌన్సిల్ సమావేశం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఎఐటియుసి నల్లగొండ జిల్లా కౌన్సిల్ సమావేశం ఈ నెల 24వ తేదీ శనివారం ఉదయం 11 గంటలకు నల్లగొండలోని ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో జరుగుతుందని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి తెలిపారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ హాజరవుతారని తెలిపారు. కావున సభ్యులందరూ సకాలంలో తప్పకుండా హాజరు కావాలని కోరారు.కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పోరాట కార్యక్రమాన్ని రూపొందిస్తారని అన్నారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా వైఫల్యం చెందాయని ఆరోపించారు.కార్మిక హక్కులను హరించే విధంగా లేబర్ కోడ్లను మార్చి పెట్టుబడిదారులకు అనుకూలంగా మారుస్తున్నారని విమర్శించారు. కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు పోరాటాలను తీవ్రతరం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# బాధితులకు సత్వర న్యాయం



**ప్రజాపక్షం/నూతనకల్ :** పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్న కుమార్ అన్నారు. శుక్రవారం మండల పోలీస్ స్టేషన్‌ని వార్షిక తనిఖీలో భాగంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్ పరిసరాలను, పోలీసు సామాగ్రిని, వివిధ రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పెండింగ్ కేసులు లేకుండా చూసుకోవాలన్నారు. స్టేషన్‌కు వచ్చిన బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని, సామాన్యులకు న్యాయం జరిగేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ రావు, ఎస్‌ఐ రావుల నాగరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** ఉమ్మడి నల్గొండఖమ్మంవరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆత్మ కమిటి చైర్మన్ పానుగంటి నరసింహ రెడ్డి, తుంగతుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేగటి రవి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల రివ్యూ సమావేశంలో వారు మాట్లాడారు. యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, ఎన్ఎస్‌యుఐ కార్యకర్తల భాగస్వామ్యంతో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరుకు బిసిలు సిద్ధమవ్వాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల అణచివేత ధోరణిని వీడకపోతే భవిష్యత్తులో బీసీల తిరుగుబాటు తప్పదని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ హెచ్చరించారు. శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలో నిర్వహించిన బీసీ యువజన సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ బలహీన వర్గాల పట్ల తీవ్ర వివక్ష చూపిస్తూ అణచివేత పాలన సాగిస్తోందని మండిపడ్డారు. త్వరలో ఖాళీ అవుతున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు అగ్రవర్ణ అభ్యర్థులనే ప్రకటించడం ద్వారా కాంగ్రెస్ తన నైజాన్ని మరోసారి బయటపెట్టుకుందని తెలిపారు.ఎన్నికల సమయంలో బీసీ జపం చేస్తూ, అధికారంలోకి వచ్చాక బీసీ సమాజాన్ని పూర్తిగా విస్మరిస్తూ దొంగ మాటలు, కపట ప్రేమతో మోసం చేస్తున్నారని ఆరోపించారు. త్వరలో జరిగే ఎన్నికలలో పట్టభద్రులందరూ బీసీ అభ్యర్థులకే మద్దతుగా నిలిచి గెలిపించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్క నాగేశ్వరరావు, బీసీ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి గంగాధర్, బీసీ యువజన సంఘం పట్టణ కార్యదర్శి మహేష్, సందీప్, ఉపేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రజల రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయమని జిల్లా అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి అన్నారు. పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాలు, పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో నివసిస్తున్న పోలీస్ అమరవీరుడు హెడ్ కానిస్టేబుల్ బడే సాహెబ్ కుటుంబ సభ్యులను ఆయన వారి నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా బడే సాహెబ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కల్పిస్తూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసులు నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల భద్రతే లక్ష్యంగా పనిచేస్తున్నారని తెలిపారు. 2000 సంవత్సరంలో తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌పై నక్సలైట్లు దాడిచేసిన సమయంలో విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ బడే సాహెబ్ వారితో వీరోచితంగా పోరాడి అమరులయ్యారని గుర్తు చేశారు. విధి నిర్వహణలో ధైర్య సాహసాలు ప్రదర్శించి, ప్రజల రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన ఆయన పోలీసు శాఖకు గర్వకారణమన్నారు. దేశం కోసం, ప్రజల భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరులను ప్రతి పౌరుడు గౌరవించాలని, వారి త్యాగాలను ఎల్లప్పుడూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి కిరణ్, అమర పోలీసు బడే సాహెబ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఎలక్షన్ కమిషనర్ తక్షణమే రాజీనామా చేయాలి




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తున్న కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్యానేష్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు, ఏఐకేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వస్కుల మట్టయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్‌కేఎం జాతీయ కమిటీ పిలుపు మేరకు మిర్యాలగూడ మండలం యాదగిరిపల్లి గ్రామంలో కేంద్ర ఎన్నికల కమిషనర్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేతిలో ఎన్నికల కమిషన్ కీలుబొమ్మగా మారిందని ఆరోపించారు. సమగ్ర సర్వే పేరుతో నిరుపేదలు, బహుజనుల ఓటర్ జాబితా నుంచి దొంగచాటుగా ఓట్లను తొలగించే కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్ డబ్ల్యూడీ కేంద్ర కమిటీ సభ్యురాలు వస్కుల సైదమ్మ, ఏఐకేఎస్ నాయకులు గువ్వల మట్టయ్య, ఏఐఎఫ్ డీఎస్ జిల్లా అధ్యక్షులు పోతుగంటి కాశి, ఏఐకేఎస్ నాయకులు వరుణ్, ఏఐఎఫ్ డబ్ల్యూడీ జిల్లా అధ్యక్షురాలు రామాంజి జ్యోతి, ఏఐఎస్ఎఫ్ నాయకులు బంటు దేవి వరప్రసాద్, సందీప్, ప్రేమ్ కుమార్, ఎస్కే సైదులు, యాదగిరి, రాములమ్మ పాల్గొన్నారు.

# ఆంగ్ల నైపుణ్యంతో మెరుగైన అవకాశాలు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రపంచవ్యాప్తంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేందుకు విద్యార్థులు ఆంగ్ల భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు.డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థుల కోసం రూపొందించిన ఇంగ్లిష్ ఫర్ ఎఫెక్టివ్ ఎక్స్‌ప్రెషన్ పాఠ్యపుస్తకాన్ని శుక్రవారం ఎంజీయూలోని తన కార్యాలయంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అంజిరెడ్డితో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆంగ్లాన్ని కేవలం పాఠ్యాంశంగానే కాకుండా విద్యా,ఉద్యోగ అవకాశాలను అందుకునేందుకు ఉపయోగపడే నైపుణ్యంగా అభ్యసించాలని సూచించారు. సాహిత్యం విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలు,నైతికతను పెంపొందిస్తుందని పేర్కొన్నారు.పాఠ్యపుస్తక రూపకల్పనలో కృషి చేసిన సంపాదకులు, రచయితలు, సహకరించిన బృందాన్ని అభినందించారు.ఈ పాఠ్యపుస్తకానికి డాక్టర్ కె.అరుణప్రియ, ప్రొఫెసర్ బి.విజయ సంపాదకులుగా వ్యవహరించగా డాక్టర్ రాహత్ ఖానం,బి.లీలారాణి,లెఫ్టినెంట్ సీహెచ్. సుధాకర్ రచయితలుగా సహకరించారు.

# నందిపాడు జంక్షన్ అండర్ పాస్‌కు రూ.37.95 కోట్లు మంజూరు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నందిపాడు జంక్షన్ వద్ద వెహిక్యులర్ అండర్ పాస్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.37.95 కోట్లు మంజూరు చేసింది. శుక్రవారం రవాణా, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేకాధికారి వికాస్ రాజ్ ద్వారా జీఓ ఆర్టీ నంబర్ 545 విడుదలైనట్లు అధికారులు తెలిపారు.మిర్యాలగూడ బైపాస్ రోడ్డులోని నందిపాడు జంక్షన్, చింతపల్లి ఎక్స్ రోడ్డు వద్ద వాహనాల రాకపోకల సౌకర్యం కోసం నూతనంగా వెహిక్యులర్ అండర్ పాస్ నిర్మాణానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మిర్యాలగూడ బైపాస్ లో తీవ్ర ప్రమాదాలు, ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్న నందిపాడు జంక్షన్ వద్ద వియుపి నిర్మాణానికి సంబంధించి ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ పంపిన ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం రూ.37.95 కోట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది.ఈ ప్రాజెక్టు పనుల నిర్వహణ కోసం వెంటనే కొత్త టెండర్ల ప్రక్రియను ప్రారంభించాలని చీఫ్ ఇంజనీర్‌ను ఆర్డర్ లో ఆదేశించారు. ఆర్థిక శాఖ ముందస్తు అనుమతితో ఈ జీఓను విడుదల చేసినట్లు తెలిపారు. బైపాస్ రహదారిపై నిత్యం వాహన చోదకులు పడుతున్న అవస్థలు, ఎదుర్కొంటున్న ప్రమాదాలకు ఈ అండర్ పాస్ నిర్మాణంతో శాశ్వత పరిష్కారం లభించనుంది. రవాణా వ్యవస్థ మెరుగుపడటంతో పాటు రాకపోకలు సులభతరం కానుండటంతో ప్రయాణికులు, స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# గొల్లగట్టు జాతరకు అధిక నిధులు కేటాయించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ (చివ్వెంల) :** తెలంగాణ రాష్ట్రంలో రెండవ అతిపెద్ద గొల్లగట్టు (పెద్దగట్టు) అధిక నిధులు కేటాయించాలని బిసి విద్యార్థి జెఏసి తెలంగాణ రాష్ట్ర చైర్మన్ వీరబోయిన లింగయ్య యాదవ్, తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక లింగమంతుల స్వామి గుట్టను సందర్శించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలలో జరిగే జాతరకు అధిక నిధులు కేటాయించి గుట్టను అభివృద్ధి చేయాలన్నారు. అదేవిధంగా గుట్టకు సంబంధించిన భూములను ప్రభుత్వ అధికారులు సర్వే చేయించి హద్దులను గుర్తించాలన్నారు. శాశ్వత పాలకమండలిని తక్షణమే ఏర్పాటు చేసి పర్మినెంట్ సౌకర్యాలను కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గొల్లగట్టు జాతర పట్ల అశ్రద్ధ వహిస్తే ముఖ్యమంత్రి ఇంటిని లక్షలాది మందితో ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ గుట్ట డైరెక్టర్ మెంతబోయిన లింగస్వామి, బిసి విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పరాల సాయి, తెలంగాణ విద్యార్థి పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి నారబోయిన లోకేష్ యాదవ్, గురవయ్య, సందయ్య, మున్న నాగయ్య పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

**ప్రజాపక్షం/తిరుమలగిరి (సాగర్) :** పట్టభద్రుల ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జటావత్ లాలు నాయక్ సూచించారు.శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్ లో మండలంలోని సర్పంచులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో అర్హత కలిగిన పట్టభద్రులను గుర్తించి వారి ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేయించాలని సర్పంచులు, పార్టీ నాయకులు,కార్యకర్తలకు సూచించారు. పట్టభద్రుల ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు అవసరమైన దరఖాస్తు ఫారాలను అర్హులైన వారికి అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఆంగోతు శ్రీను నాయక్,దస్రు నాయక్,సక్కజంగాల రవీందర్, బిచ్చాలు,అమ్ములు,శ్రవణ్ కుమార్ రెడ్డి,బుగ్గల రెడ్డి,అనుముల అంజి,పాండు, కోడుమూరు నారాయణరెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.





## సర్వే పరిశీలన

**ప్రజాపక్షం/నూతనకల్ :** మండల కేంద్రంలో జరుగుతున్న ఇంటింటి కుష్టు వ్యాధి గుర్తింపు సర్వేను మండల వైద్యాధికారి డాక్టర్ కీసర ఆశ్రితా రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వే వచ్చే నెల 4వ తారీకు వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతిరోజు సర్వే చేసి వ్యాధిగ్రస్తులను గుర్తించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ చరణ్ నాయక్, డిపిఎంఓ సీతారాంరెడ్డి, ఎంపిహెచ్ నగేష్, ఏఎన్ఎం పుష్ప, ఆశా కార్యకర్త రేణుక పాల్గొన్నారు.

## బియ్యాన్ని కృతిమ కొరత సృష్టించే వారిపై చర్యలు

**ప్రజాపక్షం/చండూరు:** ఎల్‌నినో ప్రభావం వల్ల వరి పంట దిగుబడి పడిపోతుందనే సాగుతో కొందరూ బియ్యం వ్యాపారస్తులు బియ్యాన్ని అక్రమంగా నిల్వల చేస్తూ కృతిమ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్ముతున్న బియ్యం వ్యాపారస్తులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉద్యమకారుడు కళ్లెం సురేందర్‌రెడ్డి అధికారులను కోరారు. శుక్రవారం ఆయన చండూరులో మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం తో పంటలు ఎండిపోవడంతో ఇదే అదునుగా భావించిన వ్యాపరస్తులు క్వింటాలు బియ్యం 8వేల పైనే అమ్ముతున్నారని ఆరోపించారు. బియ్యం అక్రమంగా నిల్వలు చేయకుండా సంబంధిత అధికారులు తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు.

## రామకృష్ణ మృతి కాంగ్రెస్‌కు తీరనిలోటు



**ప్రజాపక్షం/మునగాల:** సురగాని రామకృష్ణ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కాసర్ల కోటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని కృష్ణానగర్ మాజీ గ్రామశాఖ అధ్యక్షులు సురగాని రామకృష్ణ గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా ఆయన మృతదేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామకృష్ణ కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షునిగా పనిచేసి పార్టీ బలోపేతానికి ఎంతగానో కృషి చేశారని అన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో డిసిసి ప్రధాన కార్యదర్శి కాలే సామ్యేలు, సర్పంచ్ బేతం లలిత రామిరెడ్డి, సురగాని భద్రాజీ గౌడ్, నాయకులు సురగాని లింగయ్య, వెంకన్న, సైదులు, ఉపేందర్ పాల్గొన్నారు.

## ఎల్‌ఓసి అందజేత

**ప్రజాపక్షం/చండూరు:** చండూరు మున్సిపాలిటీకి చెందిన సంగేపు అమరమ్మ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమెకు కావలసిన మెరుగైన వైద్యం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి 2లక్షల 50వేలు రూపాయల ఎల్‌ఓసిని ఇప్పించడం జరిగింది. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..కాల్వ పక్కన కంచె ఏర్పాటు



**ప్రజాపక్షం/నిడమనూరు:** మండల పరిధి ముకుందాపురం నుండి కోట మైసమ్మ ఆలయానికి వెళ్లే మార్గంలో ముదిమాణిక్యం మేజర్ పక్కన ఉన్న మూలమలుపు వద్ద లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 40 వేల రూపాయల వ్యయంతో ఇనుపకంచను ఏర్పాటు చేశారు,నిత్యం భక్తుల పూజలు అందుకుంటూ కొలిచిన వారి వారి కొంగుబంగారంగా విలసిల్లుతున్న కోట మైసమ్మ ఆలయానికి వందలాది మంది భక్తులు దర్శనానికి నిత్యం వెళుతుండడంతో పాటు ఈ మార్గం నుండి అడవిదేవులపల్లి,ఆలియా,మిర్యాలగూడకు వాహనాల రాకపోకల రద్దీ ఉండడంతో అనేక పర్యాయాలు పలు వాహనాలు అదుపుతప్పి ముదిమాణిక్యం మేజర్ కాలువలోకి దూసుకుపోతుండడంతో పలుమార్లు ప్రాణా నష్టం జరిగిన సంఘటనలు ఉన్నాయి, దీనిని దృష్టిలో పెట్టుకొని హాలియా సీఐ రాఘవరావు నిడమనూరు ఎస్సై విజయ్ కుమార్ లు లయన్స్ చార్టర్ ప్రెసిడెంట్ చేకూరి హనుమంత రావు దృష్టికి తీసుకురావడంతో ఆయన ఆదేశాల మేరకు లయన్ గండికోట యాదగిరి లయన్ చేకూరి వంశీ చరణ్ లు స్పందించి ఇనుప కంచ ఏర్పాటు చేశారు, ప్రమాదాల నివారణకు లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇనుప కంచె ఏర్పాటు చేయడం పట్ల పలువురు వర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో హాలియా సీఐ రాఘవరావు, నిడమనూరు ఎస్సై విజయ్ కుమార్,ముకుందాపురం సర్పంచ్ సలికంటి పద్మాసత్యం,మాజీ మార్కెట్ చైర్మన్ లయన్ అంకతి సత్యం,లయన్ పాంపాటి శ్రీనివాస్,బెల్దీ అశోక్,చిత్రం అశోక్,మంజుల శ్రీనివాస్,కేశ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులంటే....భయం కాదు భరోసా

**ప్రజాపక్షం/నందికొండ:** పోలీసులంటే కేవలం నేరస్థులను పట్టుకునే వారే కాదు..ప్రజల రక్షణకు నిరంతరం శ్రమించే భద్రతా సిబ్బంది కూడా. వారి బాధ్యతలు, విధులపై అవగాహన కల్పించేందుకు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా విజయపురి టౌన్ పోలీస్ స్టేషన్‌లో సెయింట్ జోసఫ్ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ కే. సతీష్ పోలీస్ స్టేషన్‌లో పోలీసుల విధుల నిర్వహణ,నేరాల నియంత్రణ,శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్రను విద్యార్థులకు వివరించారు.ప్రజల భద్రత కోసం ఉపయోగించే పరికరాలు,అత్యవసర సమయాల్లో తీసుకునే చర్యలను పరిచయం చేశారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండటం,నేరాలకు దూరంగా ఉండటంతో పాటు సమాజంలో బాధ్యతా




యుత పౌరులుగా ఎదగాల్సిన అవసరాన్ని తెలియజేశారు.విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.పోలీస్ శాఖ పనితీరును ప్రత్యక్షంగా తెలుసుకునే ఇలాంటి కార్యక్రమాలు చిన్నతనం నుంచే చట్టాల పట్ల గౌరవాన్ని పెంపొందించడంతో పాటు పోలీసుల పట్ల సానుకూల దృక్పథాన్ని ఏర్పరుస్తాయని తెలిపారు.

## పోలీసు స్టేషన్‌లో ఓపెన్ హౌస్

**ప్రజాపక్షం/నకిరేకల్ :** పోలీసు వ్యవస్థ,విధులపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఓపెన్ హౌస్ కార్యక్రమం దోహదపడుతుందని ఎస్ఐ మునుగోటి రవీందర్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సాందీపని పాఠశాల విద్యార్థులకు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీసు విధానాలు,ఆయుధాలు,సమాచార మార్పిడి పరికరాలు,భద్రతా సామగ్రి పనితీరును వివరించారు.మహిళల రక్షణకు పనిచేసే షీ టీమ్స్, భరోసా కేంద్రాల సేవలను తెలియజేశారు. ప్రజలు భయపడకుండా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసే విధానం, పోలీసుల దైనందిన విధుల గురించి వివరించారు.




విద్యార్థులే భావిభారత పౌరులని, పోలీసు వ్యవస్థపై అవగాహనతో శాంతియుత సమాజం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఏఎస్ఐ రాధారపు అంజయ్య,పోలీసు సిబ్బంది తవిడబోయిన రామ్మోహన్,గంట శంకర్,రవీందర్‌రెడ్డి, అనూష తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలను గౌరవించాలి

**ప్రజాపక్షం/హాలియా :** విద్యార్థులు చట్టాలను గౌరవించాలని హాలియా సీఐ రాఘవరావు అన్నారు.పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా హాలియాలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమంలో చట్టాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలీసులు నిర్వహిస్తున్న విధులు,విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.చట్టాలను గౌరవించడం నేర్చుకున్నప్పుడే భద్రతపై మరింత అవగాహన ఏర్పడుతుందని చెప్పారు.ఆయుధాలను ఎలా వాడాలో,ఏ సందర్భంలో వాడాలో విద్యార్థులకు తెలిపారు. సమాచార వ్యవస్థ అభివృద్ధి కోసం ప్రతి విద్యార్థి యూనిఫాం లేని పోలీసే అని అన్నారు.ఈ కార్యక్రమంలో హాలియా ఎస్ఐ సాయి ప్రశాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## రెండో రోజు శిక్షణ

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జనగణన నిర్వహణకు సంబంధించి జిల్లా, డివిజనల్ స్థాయి అధికారులు, ఛార్జ్ ఆఫీసర్లు, అదనపు ఛార్జ్ ఆఫీసర్లకు శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెండో రోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమంలో తహసీల్దార్లు (ఛార్జ్ ఆఫీసర్లు), ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు (అదనపు ఛార్జ్ ఆఫీసర్లు)తో పాటు జిల్లా,డివిజనల్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.జనగణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులకు అవసరమైన అవగాహన కల్పించడం, విధివిధానాలపై శిక్షణ అందించడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.





## ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం

**ప్రజాపక్షం/గుండాల;** ఖమ్మంనల్గొండవరంగల్ పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల సన్నాహక సమావేశం శుక్రవారం గుండాల మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఇమ్మడి దశరథ గుప్త ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్ఏ బీర్ల అయిలయ్య పాల్గొని మాట్లాడుతూ ఖమ్మంనల్గొండవరంగల్ పట్టభద్రుల ఎంఎల్‌సి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీ గెలిపించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపుకు శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో మోత్కూర్ మార్కెట్ కమిటి చైర్మన్ విమల వెంకటేశ్వర్లు, లింగాల బిక్షం, యాదగిరి, జిల్లా నాయకులు వెంకన్న, రాంరెడ్డి, అనిల్, నాగిరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, పిఏసిఎస్ డైరెక్టర్లు నాగరాజు, నారాయణ,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/తుంగతుర్తి (తిరుమలగిరి) :** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఈనెల 26న జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే రక్తదాన శిభిరాన్ని ప్రజలు, యువత ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదాన శిభిరంలో పాల్గొనాలని పోలీసులు, కళాబృందం సభ్యులు కోరారు. శుక్రవారం తొండ తిరుమలగిరి మండల కేంద్రంలో రక్తదాన శిభిరాన్ని విజయవంతం చేయాలని కోరుతూ కళాబృందం సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించారు. దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను, త్యాగాలను స్మరించకుంటూ, ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం చేయడం గొప్ప మానవతా సేవ అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సంజీవ చారి, కళాబృందం ఇంచార్జి యల్లయ్య, సభ్యులు గోపయ్య, ఈశ్వరచారి, సత్యం, గుర్లింగం, కృష్ణ పాల్గొన్నారు.

## సంబరాల మాటున పర్యావరణ విధ్వంసం

**ప్రజాపక్షం/నందికొండ:** ఊరేగింపులు,ఉత్సవాల్లో బ్లాస్టింగ్ పేపర్ల వినియోగం ఇటీవల కొత్త పోకడగా మారింది. వేడుకల సందర్భంగా వీటిని విరివిగా ఉపయోగిస్తుండటంతో పర్యావరణానికి హాని కలుగుతోంది.ఈ పేపర్లు రోడ్లపై,బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడ పడితే అక్కడ పేరుకుపోతున్నాయి. వాటిని ఆహారంగా భావించి మూగజీవాలు తినే ప్రమాదం కూడా ఉంది.దీంతో వాటి ఆరోగ్యానికి ముప్పు ఏర్పడే అవకాశం ఉంది.వేడుకలు నిర్వహించుకోవడంలో తప్పులేదు కానీ,వాటి పేరుతో పర్యావరణాన్ని కలుషితం చేయడం,మూగజీవాలకు హాని కలిగించడం సరికాదని పలువురు అభిప్రాయపడుతున్నారు.పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని బ్లాస్టింగ్ పేపర్ల వినియోగాన్ని నియంత్రించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.నిబంధనలు ఉల్లంఘించి పర్యావరణానికి హాని కలిగించే వారిపై జరిమానాలు విధించడంతో పాటు, అవసరమైతే నిషేధంఅమలు చేయాలని సూచిస్తున్నారు.





## పెద్దమ్మ తల్లికి ఎమ్మెల్యే పూజలు

ప్రజాపక్షం/నకిరేకల్: మండల పరిధిలోని తాటికల్ గ్రామంలో జరుగుతున్న పెద్దమ్మ తల్లి పండుగలో ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీమండల పట్టణ అధ్యక్షులు గాదగోని కొండయ్య,లింగాల వెంకన్న చౌగోని శ్రీనివాస్,చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఐకెపి విఓఎల సమస్యలు పరిష్కరించాలి



ప్రజాపక్షం/తిప్పర్తి: ఐకేపీ వీవోఏల సమస్యలు పరిష్కరించి ఉద్యోగ భద్రత కల్పించాలని,కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని అక్టోబర్ 25, 26న ఇందిరా పార్క్ వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ తిప్పర్తి మండల కన్వీనర్ భీమగాని గణేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం తిప్పర్తి మండల కేంద్రంలో ఏపీఎంకు వినతిపత్రం అందజేశారు.గ్రామాల్లో ప్రభుత్వ పథకాల అమలు, సంఘాల అభివృద్ధిలో వీవోఏలు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారిని ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు.వీవోఏలకు పీఎఫ్,ఈఎస్ఐ,ప్రమాద బీమా,ఐడెంటిటీ కార్డులు ఇవ్వాలని, సెర్ప్ ద్వారా వేతనం చెల్లించాలని కోరారు. ఎండి రుమాన్, సైదులు,నాగరాజు, యాదమ్మ,సునిత,సువర్ణ, స్రవంతి పాల్గొన్నారు.

## ధనమ్మకు నివాళులు



ప్రజాపక్షం/నకిరేకల్: పట్టణానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు,టౌన్ మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు దికొండ దనమ్మ దశదిన కర్మ కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ పాల్గొని,ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో వెంకన్న,మెరుసంఘం అధ్యక్షుడు,చెనగొని రాజశేఖర్,రాపోలు నగేష్,చెరుపల్లి సైదులు,పశుపతి,సతీష్,గిరి తదితరులు పాల్గొన్నారు.

## రేపు కట్టంగూర్ ఎఫ్‌పిసిఎల్‌ను సందర్శించనున్న ఉన్నతాధికారులు

ప్రజా పక్షం/నకిరేకల్: కట్టంగూరు మండలం ఐటిపాముల (గంగాదేవిగూడెం) గ్రామ పరిధిలో ఉన్న కట్టంగూర్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ (ఎఫ్‌పీసీఎల్)ను ఆదివారం ఉదయం 10 గంటలకు వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.ఎం. సురేంద్ర మోహన్, నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ సైదమ్మ,సీఈవో రమేష్ తెలిపారు.నూతనంగా అమలు చేస్తున్న పథకాలలో భాగంగా ఏర్పాటు చేసిన పామాయిల్ కస్టమ్ హైరింగ్ సెంటర్ (సీహెచ్‌సీ), రైతుల అవగాహన తరగతి గదులనుపరిశీలించనున్నారు.ఈ కార్యక్రమానికి రైతులు అందరూ హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

# నిరంతర విద్యుత్ సరఫరా అందించాలి



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో వరి పంటలు ఎండిపోకుండా రైతులకు నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని టిజిఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ ఆపరేషన్స్ వి. శివాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా పరిధిలోని సూర్యాపేట రూరల్, పట్టణ ప్రాంతాల్లో ఆకస్మిక క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విద్యుత్ సరఫరా పరిస్థితులను క్షేత్రస్థాయిలో సూర్యాపేట రూరల్ మండలం రాయినిగూడెం గ్రామంలో పంట పొలాలను పరిశీలించి, నేరుగా రైతులకు ఏమైనా విద్యుత్ సమస్యలు ఉన్నాయని ఆరా తీశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. రానున్న రోజుల్లో వరి పంటలు ఎం డిపో కుండా నిరంతర విద్యుత్ అందించేందుకు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో సూర్యాపేట సూపరింటెండింగ్ ఇంజనీర్ పి. యాదగిరి, డివిజనల్ ఇంజనీర్ ఎన్. వెంకటకృష్ణయ్య, టౌన్ ఆపరేషన్స్ ఏడిఈ ఎల్. శ్రీనివాసరావు, రూరల్ ఏడిఈ వి. రాములు నాయక్‌లతో పాటు విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# సర్పంచ్‌ల సమస్యలు పరిష్కరించాలి



ప్రజాపక్షం/డిండి; సర్పంచ్‌లు గ్రామాల్లో నెలకొన్న అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ప్రభుత్వం సంబంధిత జిల్లా అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి సర్పంచ్‌ల సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ రాజ్ ఛాంబర్ జిల్లా సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ చింతలపూడి భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలోని సాయిరమ్య ఫంక్షన్ హాల్లో జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిజిరామ్‌జీ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థలో భాగంగా ఎల్‌నినో ప్రభావం నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జిల్లా, డివిజన్, మండల అధికారులు, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసమావేశంలో భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఎల్‌నినో వల్ల వర్షాపాతం అట్టడుగున ఇంకిపోవడం వలన ప్రతి గ్రామంలో ప్రతి ఒక్కరూ నీటిని పొదుపు చేసే విధంగా కార్యక్రమం చేపట్టాలని వివిజి రామ్‌జీ ద్వారా ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు నిర్మించాలని, పబ్లిక్ ప్లేస్‌లలో వృధాగా పోతున్న వర్షపు నీటిని కానీ ట్యాప్‌ల వలన నీటిని నిలుపుదల చేయాలని అందుకు ఇంకుడు గుంతలు తీయించకోవాలని, ప్రతి గ్రామ పంచాయతీకి గ్రామ పంచాయతీ బిల్డింగ్‌లు, వివో బిల్డింగ్, రేషన్ షాపులు, డీలర్ షిప్లు ఒక కిలోమీటర్ నుండి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొత్త గ్రామ పంచాయతీలకు అక్కడికి వచ్చి ఫించన్లు ఇవ్వాలని గ్రామస్తులు వికలాంగులు, వృద్ధులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. నల్గొండ జిల్లాలో ఉన్న ప్రతి గ్రామ పంచాయతీలో ఇబ్బందులు ఉన్నాయని ప్రభుత్వం, అధికారులు వాటికి పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు.

# పోలీసు అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం



ప్రజాపక్షం/నకిరేకల్ : పోలీసు అమరవీరుల కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సూర్యాపేట ఏఆర్ డీఎస్‌పి నరసింహాచారి తెలిపారు.పోలీసు ఫ్లాగ్ డే వారోత్సవాలు 2026లో భాగంగా శుక్రవారం పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌తో కలిసి నకిరేకల్‌లోని అమర కానిస్టేబుల్ లింగయ్య నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సిమి ఉగ్రవాదుల చేతిలో విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన కానిస్టేబుల్ లింగయ్య సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతోపాటు వారి కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యమివ్వడమే ఫ్లాగ్ డే వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ ఎస్ఐ గడగోజు కృష్ణమాచారి,ఎస్ఐ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ప్రాధాన్యతా రంగాలకు రుణాల మంజూరు పెంచాలి




ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : జిల్లాలో ప్రాధాన్యతా రంగాలకు సంబంధించిన రుణాల మంజూరును పెంచాలని,గృహ నిర్మాణ,విద్యా రుణాలపై బ్యాంకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ (డీసీసీ) సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జిల్లాలో బ్యాంకుల పనితీరు, రుణాల మంజూరు, వివిధ సంక్షేమ కార్పొరేషన్లకు సంబంధించిన పెండింగ్ రుణ దరఖాస్తులపై సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గృహ నిర్మాణ రుణాలు, విద్యా రుణాల మంజూరు తక్కువగా ఉందని, వాటిని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు.అర్హులైన విద్యార్థులకు ఉన్నత విద్య కోసం, ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు గృహ రుణాలు సకాలంలో అందేలా చూడాలన్నారు. జిల్లా ఎస్సీ కార్పొరేషన్,గిరిజన సంక్షేమ కార్పొరేషన్ల ద్వారా మంజూరు చేయాల్సిన రుణాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిశీలించి అర్హులైన లబ్ధిదారులకు రుణాలు అందించాలని ఆదేశించారు. స్థానిక సంస్థల ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి,ట్రైనీ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, ఆర్‌బిఐ ఎల్‌డిఓ ప్రదీప్,నాబార్డ్ డీడీఎం వినయ్ కు మార్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, ఎల్‌డిఎం శ్రామిక్, కోఆపరేటివ్ బ్యాంక్ సీఈవో శంకరరావు, జిల్లా అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.



## ఉత్తమ ఫలితాల సాధనే ధ్యేయంగా బోధన

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ రాబోయే పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనే ధ్యేయంగా అధ్యాపకులు బోధన సాగించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సులోచన రాణి సూచించారు. శుక్రవారం అకాడమిక్ తనిఖీలో భాగంగా సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి, కళాశాలలో విద్యా కార్యక్రమాల అమలు తీరును పరిశీలించి అధ్యాపకులకు దిశానిర్దేశం చేశారు. కళాశాలలో విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు కార్యాచరణ రూపొందించాలని, విద్యార్థుల హాజరు శాతాన్ని మెరుగుపరిచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అధ్యాపకుల పాత్ర అత్యంత కీలకమన్నారు. ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని గుర్తించి, వారిలో అభ్యసన ఆసక్తిని పెంపొందిస్తూ ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ తనిఖీలో కళాశాల ప్రిన్సిపాల్ పెరుమాళ్ళ యాదయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ అవార్డు అందుకున్న విద్యార్థినికి ప్రశంసలు



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : జాతీయ స్థాయిలో నిర్వహించిన సైన్స్ ప్రాజెక్టుల ఇన్‌స్పైర్ పోటీల్లో ప్రదర్శించిన స్మార్ట్ స్టీరింగ్ విత్ హెల్త్ ఎలర్ట్స్ టు రెడ్యూస్ ది యాక్సిడెంట్స్ ప్రాజెక్ట్‌కు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన ఎంఎస్ఆర్ సెంట్రల్ స్కూల్ విద్యార్థి కొల్లు మహీధర్‌ను, సిబిఎస్ఈ జాతీయ స్థాయిలో అథ్లెటిక్స్ 600 మీటర్ల పరుగు పందెంలో స్వర్ణం సాధించిన ఎంఎస్ఆర్ సెంట్రల్ స్కూల్ విద్యార్థిని కుమారి సాత్వికను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అభినందించారు. జాతీయ స్థాయిలో జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేసిన విద్యార్థులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించి, వారి భవిష్యత్ ఉన్నతికి ఆకాంక్షలు తెలిపారు. విద్యార్థుల ప్రతిభకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషి కారణమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సిహెచ్ శ్రీనివాస్‌రావు, జిల్లా సైన్స్ అధికారి దేవరాజు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

## కార్మిక హక్కుల కోసం కదం తొక్కాలి

ప్రజాపక్షం/నకిరేకల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలకు నిరసనగా అక్టోబరు 25, 26 తేదీల్లో హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద నిర్వహించే చలో హైదరాబాద్ నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లకపాక రాజు,జిల్లా కమిటీ సభ్యుడు వంటిపాక వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. నకిరేకల్‌లో చలో హైదరాబాద్ గోడపత్రికలను వారు ఆవిష్కరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల సంబరాలు చేసుకుంటుందే తప్ప ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. కాంగ్రెస్,బీజేపీ పార్టీలు వేరైనా కార్మిక, ఉద్యోగుల పట్ల వాటి విధానాలు ఒకేలా ఉన్నాయని విమర్శించారు.కార్మికులు,ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ విధానాలను నిరసించాలని కోరారు.ఈకార్యక్రమంలో నాయకులు వంటిపాక కృష్ణ ,తాడువాయి రాములు,బొల్లెపల్లి కృష్ణ,సూరారపు వీరయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.



# అనుమానాస్పదంగా కార్మికురాలు మృతి

### కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** అనుమానాస్పదంగా కార్మికురాలు మృతి చెందిన సంఘటన చౌటుప్పల్ మండలం తుఫ్రాన్‌పేట గ్రామ పరిధిలోని భాస్కర్ ఆగ్రో కెమికల్ పరిశ్రమలో శుక్రవారం జరిగింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం గ్రామానికి చెందిన ఏచూరి స్వప్న (43) గత కొన్ని సంవత్సరాలుగా భాస్కర్ ఆగ్రో కెమికల్ పరిశ్రమలో ప్యాకింగ్ చేసే పనుల్లో కార్మికురాలుగా పని చేస్తుంది. భర్త ఏచూరి కృష్ణతో రెండో వివాహం జరిగింది.అప్పటికే ఓ కొడుకు ఉన్నట్లు సమాచారం.దసరాకు భర్త ముంబాయి నుండి వచ్చాడు.దసర పండుగ సెలవుల తర్వాత శుక్రవారం కంపెనీకి పని కోసం వెళ్ళింది.డ్యూటీలో ఉండగా తల తిరిగినట్లుగా ఉండడంతో మంచి నీళ్ళు తాగింది.వెంటనే కిందపడిపోవడంతో గమనించిన తోటి కార్మికులు చూసి అబ్దుల్లాపూర్‌మేట్ లోని మనోజ్ఞ ఆసుపత్రికి తరలించారు.వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.విషయం తెలుసుకున్న కార్మికురాలి బంధువులు పరిశ్రమ వద్దకు చెరుకోని ఆందోళన నిర్వహించారు.పరిశ్రమలోని కెమికల్ వాసనతోనే స్పృహ తప్పి పడిపోయి మరణించిందని ఆరోపిస్తూ ఆందోళన చేశారు.చౌటుప్పల్ సిఐ మన్మథ కుమార్,ఎస్సై రవీందర్‌లు పరిశ్రమ వద్దకు చేరుకోని ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులకు సర్దిచెప్పి ఆందోళన విరమింప చేశారు. పరిశ్రమలో పని చేస్తూ మరణించిన స్వప్న కుటుంబానికి పరిశ్రమ యాజమాన్యం నష్టపరిహరంగా రూ.30లక్షలు ఇవ్వడానికి ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం.మృతురాలికి కొడుకు ఉన్నాడు.భర్త కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ జి.మన్మథకుమార్ తెలిపారు.మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.



## జ్ఞానేష్‌కుమార్‌ను వెంటనే రాజీనామా చేయాలి

**ప్రజాపక్షం/కోదాడ:** భారతఎన్నికల ప్రధానఅధికారి జ్ఞానేష్‌కుమార్ వెంటనే రాజీనామా చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ముల్కలపల్లి రాములు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక రంగా థియేటర్ చౌరస్తాలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జ్ఞానేష్‌కుమార్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న మోడి సర్కార్ రాజ్యాంగ హక్కులను ఉల్లంఘిస్తూ భారత ఎన్నికల ప్రధాన కార్యదర్శి జ్ఞానేష్‌కుమార్ ఏకపక్ష నిర్ణయాల వల్ల దేశ వ్యాప్తంగా 13కోట్ల మంది ఓట్లు రద్దు అయ్యాయని అన్నారు. మోడి సర్కార్ నాల్గవ సారి అధికారంలోకి రావడం కోసం కీలుబొమ్మ లాంటి జ్ఞానేష్‌కుమార్‌ను అడ్డంపెట్టుకుని ఓట్లు తొలగించారని అన్నారు. ఈ కార్యక్రమంలో మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కోటగిరి వెంకటనారాయణ, ఎం.ముత్యాలు, షేక్ సైదా, జూలకంటి విజయలక్ష్మి, అల్సకాని బ్రహ్మయ్య, రాపోలు సూర్యనారాయణ, నాగాటి రాములు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి



**ప్రజాపక్షం/కోదాడ:** త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ నాయకులు శుక్రవారం కోదాడలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కోదాడ మున్సిపాలిటిలోని పట్టభద్రులను కలిసి మద్దతు కోరారు. విద్యా ఉపాధి రంగాలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని నిరుద్యోగులను మోసం చేసిందని విమర్శించారు. తమ పార్టీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి నిరుద్యోగ సమస్యలపై అవిశ్రాంత పోరాటం చేశారన్నారు. ప్రతి పట్టభద్రుడు ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో నాయకులు ఉపేందర్, కరీముల్లా, బత్తుల ఉపేందర్, కాసాని మల్లయ్య, వెంకట్, శ్రీను, అబ్బు, సైదులు పాల్గొన్నారు.

## చెక్కులు అందజేత

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** పోచంపల్లి మండలంలోని గౌస్ కొండగ్రామంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధితులకు గురువారం అందజేసినట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్ తెలిపారు.లింగాల శ్రీశైలం కు రూ.28వేలు,భీమగాని శివకు రూ.19వేలు విలువైన చెక్కులను ఇచ్చినట్లు చెప్పారు.ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్మునుకుంట్ల నరేష్ గౌడ్ గ్రామ శాఖ అధ్యక్షుడు దోసపాటి రవి ఉపాధ్యక్షుడు కాసుల శ్రీధర్ గౌడ్మాజీ సర్పంచ్ లింగాల నర్సింహ్మా వార్డు మెంబర్ దుబ్బాక శ్రీకాంత్ కాసుల గోవర్ధన్‌గౌడ్మద్ది రకన్య వంగూరి రవి ఎండి ఆబ్రహం పొండాల అశోక్ గౌడ్ కందాడి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.



## రూ.1000కోట్లకు చేరువలో ఉండటం ఖాతాదారుల నమ్మకం



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** పోచంపల్లి బ్యాంకు ఖాతాదారుల బలమైన విశ్వసనే వ్యాపారంలో వృద్ధి రూ.1000కోట్లకు చేరువలోకి వచ్చిందని త్వరలోనే షెడ్యూల్ బ్యాంకుగా అవతరిస్తుందని బ్యాంకు చైర్మన్ తడక రమేష్ ధీమాతో సంతోషం వ్యక్తం చేసారు.బుధవారం బ్యాంకు 29వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వ్యవస్థాపక అధ్యక్షుడు కీ.శే.కొంగరి భాస్కర్ ఆశయాలకు అణుగుణంగా బ్యాంకును అభివృద్ధి పథంలో నడుపుతున్నామని మరింత శక్తివంతంగా పురోగతి సాధించేదుకు శాయశక్తుల కృషి చేస్తామని తెలిపారు.బ్యాంకు వ్యాపారం రూ. 683.96 కోట్లకు చేరిందని రానున్న రోజుల్లో అది వెయ్యి కోట్లను అధిగమిస్తుందని బ్యాంకు సిఈవో సీత శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు.ఖాతాదారులకు విశేష సేవలు అందించటంవల్ల కార్పోరేట్ బ్యాంకులకు ధీటుగా ఎదుగుతామని ఆశాభావ వ్యక్తం చేసారు.ఇటీవల ప్రమాద వశాత్తు మరణించిన బాధిత కుటుంబానికి లక్ష రూపాయల చెక్కును చైర్మన్ అందజేశారు.ఈ కార్యక్రమంలో బ్యాంకు వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్ డైరెక్టర్ లు కర్నాటి బాలసుబ్రమణ్యం ఏలే హరిశంకర్ సూరెపల్లి రమేష్ రాపోలు వేణు గుండు కావ్య కర్నాటి భార్గవి బిట్టు భాస్కర్ మక్తాల నర్సింహ్మా చీఫ్ ఇన్సపెక్షన్ సెక్యూరిటి ఆఫీసర్ శ్రీనివాస శాస్త్రి ఎజియం రాచకొండ మధుసూదన్ సీనియర్ మేనేజర్స్ మల్లికార్జున్ రావు రచ్చ శ్రీనివాస్ బ్యాంకు సిబ్బంది ఖాతాదారులు వాటాదారులు పాల్గొన్నారు.

## నీటి వృధా లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలి

**ప్రజాపక్షం/దేవరకొండ:** రానున్న పది నెలల పాటు గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ సర్పంచులు, గ్రామ కార్యదర్శులను కోరారు. గ్రామాల్లో పైపులైన్ లీకేజీలు, ఇతరాత్ర నీటి వృధా లేకుండా నివారించి నీటి వృధా లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలని తెలిపారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలోని సాయిరమ్య ఫంక్షన్ హాల్‌లో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎల్‌నినో ప్రభావం తీసుకోవాల్సిన చర్యలపై సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎల్ నినో వల్ల వాతావరణ మార్పుల ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో నీటి వనరులను కాపాడుకోవడం అత్యంత అవసరమన్నారు. గ్రామాల్లో చెరువులు, మిషన్ భగీరథ, బోర్లు, కాలువలు వర్షపు నీటి ద్వారా లభించే నీటి నిల్వలపై ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలోని గ్రామాలలో అందుబాటులో ఉన్న నీటి వనరులు, నీటి నిల్వల వివరాలను గ్రామ కార్యదర్శులు తెలుసుకొని, వాటిని రానున్న నెలల్లో అవసరాలకు సరిపడా వినియోగించుకునేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. జూలై వరకు నీటి కొరత రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నీటి సంరక్షణ చర్యలలో భాగంగా గ్రామాలలో పైపులైన్ లీకేజీలను అరికట్టాలని, ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని సూచించారు. తాగునీరు, సాగునీటికి ఎంత అవసరమో అంతే వినియోగిస్తూ నీటి పొదుపు సూత్రాలను ప్రజలు పాటించేలా అవగాహన కల్పించాలని అన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలో కూలీలకు పని కల్పించాలని, పశుసంపదను సంరక్షిస్తూ పశువులకు తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, మహిళా సంఘాలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటుగ్రామాల్లో ఉపాధి పనులను విస్తృతంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్ కొరత ఉన్న చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ఎంపిడివోలు పర్యవేక్షణ బాధ్యత తీసుకోవాలని, పనులకు కొలతల పుస్తకాల ప్రకారం బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం కలెక్టర్ సర్పంచ్‌లతో కలిసి కింద కూర్చొని వారి సమస్యలను అడిగి తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సబ్ కలెక్టర్ కోలిన్ చింగ్‌యాన్ మావి, స్థానిక సంస్థల ఇంచార్జీ, అదనపు కలెక్టర్ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, ట్రైనీ సహాయ కలెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వినోద్‌కుమార్, పశు సంవర్ధక శాఖ అధికారి రమేష్, డిపివో తరుణ్‌చక్రవర్తి, ఇంచార్జీ ఎంపిడివో పార్వతి, జిల్లా సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తం

### చౌటుప్పల్ సిఐ జి.మన్మథకుమార్

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చౌటుప్పల్ సిఐ జి.మన్మథకుమార్ అన్నారు.చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులు,వృద్ధులు సైబర్ నేరగాళ్ళ ఉచ్చులో పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్,ఆన్‌లైన్ లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దని సూచించారు.సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సైబర్ కానిస్టేబుల్ మమత,రిటైర్డ్ సంఘం మండల అధ్యక్షులు భీమిడి మోహన్‌రెడ్డి,ప్రధాన కార్యదర్శి కానుగుల వెంకటయ్య,బాతరాజు ఆగయ్య,బిక్కునాయక్,శ్రీరాములు,సత్తిరెడ్డి,కృష్ణ,మురళి,వినోద్,కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నరకం

(మొదటి పేజీ తరువాయి)

వైద్య సేవల కోసం ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి కుటుంబ సభ్యులు కూడా ఈ రద్దీతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఫుట్‌పాత్ ఆక్రమణ కనిపించడంలేదా...?** ఇటీవల సినీ నటితో ఆర్భాటంగా ప్రారంభించిన ఓ వస్త్ర దుకాణం ఫుట్‌పాత్‌ను ఆక్రమించి లగేజీ పాయింట్ ఏర్పాటు చేసిందన్న ఆరోపణలు స్థానికంగా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే అంబులెన్స్‌లు తిరగటానికి కూడా వీలులేకుండా ఫుట్‌పాత్ ఆక్రమించడమే చర్చనీయాంశంగా మారాయి. పాదచారులు నడవాల్సిన ఫుట్‌పాత్ వ్యాపార అవసరాలకు వినియోగిస్తే ఇక ప్రజలు రోడ్డుపైనే నడవాలా..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రహదారుల వెంట తోపుడు బండ్లు పెట్టుకుని జీవనం సాగించే చిరు వ్యాపారులపై చర్యలు తీసుకునే ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు పెద్ద దుకాణాల వద్ద ఫుట్‌పాత్ ఆక్రమణలపై ఎందుకు స్పందించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించినా పలుకుబడి ఉన్న వారికి ఒక రకంగా, జీవనోపాధి కోసం చిన్న వ్యాపారాలు చేసుకునే వారికి మరో రకంగా వ్యవహరిస్తున్నారా..? చట్టం అందరికి సమానంగా వర్తించాల్సిన చోట కార్పోరేట్ దుకాణాలకు ప్రత్యేక వెసులుబాటు కల్పిస్తున్నారా.? అనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే సంబంధిత దుకాణం ఆక్రమణకు సంబంధించిన ఆరోపణలపై అధికారులు పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాల్సి ఉంది.

**రద్దీ కూడళ్లలో తనిఖీలతో మరింత ఇబ్బంది...!** మరోవైపు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లే మార్గంలోని మూలమలుపు వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య మరింత పెరుగుతుందని స్థానికులు చెబుతున్నారు. సాధారణంగా వాహన తనిఖీలకు అనువైన, ట్రాఫిక్‌కు అంతరాయం కలగని ప్రదేశాలను ఎంచుకోవాల్సి ఉండగా, రద్దీగా ఉండే కూడళ్లలో తనిఖీలు చేపట్టడం వల్ల వాహనాలు నిలిచిపోతున్నాయని ఆరోపిస్తున్నారు. అత్యవసర పనులపై వెళ్లేవారు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటున్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే దారిలో వాహనాలను ఆపి, ఫోన్లు తీసుకోవడం, వాహనాల తాళాలు స్వాధీనం చేసుకోవడం ద్వారా పోలీసులు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని కొందరు స్థానికులు ఆరోపిస్తున్నారు.

**అధికారుల పర్యవేక్షణ ఏదీ...?** పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ, ఫుట్‌పాత్ పరిరక్షణ, పార్కింగ్ క్రమబద్ధీకరణ బాధ్యతలు సంబంధిత శాఖలపై ఉన్నాయి. అయినప్పటికీ ప్రధాన రహదారిపై పరిస్థితి రోజు రోజుకు దిగజారుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో పనిచేస్తే సమస్యను కొంతవరకైనా తగ్గించవచ్చని సూచిస్తున్నారు.

**ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలి** ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు వస్తున్న నిర్మాణాన్ని అధికారులు తక్షణమే పరిశీలించి, ఆక్రమణ ఉన్నట్లు తేలితే నిబంధనల ప్రకారం తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. పార్కింగ్ సదుపాయలు లేని రహదారి పక్కన భారీ వాణిజ్య దుకాణాలకు అనుమతులు ఇచ్చే విషయంలో కఠిన నిబంధనలు పాటించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికే నడవడానికి కూడా ఇబ్బందిగా మారిన ప్రధార రహదారిని ఆక్రమణల నుంచి కాపాడి వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. చిరు వ్యాపారులపై చర్యలు తీసుకున్నట్లే పెద్ద దుకాణాల విషయంలోనూ నిబంధనలు అమలు చేయాలి. రద్దీ కూడళ్లలో తనిఖీలకు బదులుగా ప్రజలకు ఇబ్బంది కలగని ప్రత్యామ్నాయ ప్రాంతాలను పరిశీలించాలి. కోదాడ ప్రజలకు ట్రాఫిక్ కష్టాల నుంచి ఉపశమనం కల్పించేందుకు అధికారులు ఇప్పటికైనా స్పందిస్తారా..? లేక ఫుట్‌పాత్ ఆక్రమణలు, ట్రాఫిక్ అస్తవ్యస్తత ఇలాగే కొనసాగుతాయా..? అన్నది వేచి చూడాలి.